సాక్షి సూర్యాపేట

శనివారం । 9 । ఆగస్టు । 2025



ఆర్‌ఎంపీ అరెస్టు
లింగ నిర్ధారణ పరీక్ష చేసి గర్భిణి మృతికి కారణమైన కేసులో ఆర్‌ఎంపీని పోలీసులు అరెస్టు చేశారు. - 8లో



ప్రజాస్వామ్యం ఖూనీ..
నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. - 10లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	589.10 అడుగులు
ఇన్‌ఫ్లో	:	43,999 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	43,999 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	28,948 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	5,598 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	7,353 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	1,800 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	300 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ చంద్రశేఖర్

చివ్వెంల : సీజనల్ వ్యాధులతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం చివ్వెంల పీహెచ్‌సీని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, సిబ్బంది వివరాల గురించి వైద్యాధికారి భవానిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో మందుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాల నేపథ్యంలో గ్రామాల్లోని ప్రజలకు ఏఎన్‌ఎంలు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఆయన వెంట హెల్త్ సూపర్‌వైజర్లు, సిబ్బంది ఉన్నారు.

కేజీబీవీ సమస్యను కలెక్టర్‌కు వివరిస్తాం



అర్వపల్లి కేజీబీవీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఈఓ అశోక్

అర్వపల్లి: భారీ వర్షాలు కురిసిన ప్రతిసారి అర్వపల్లిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం జలమయమై బాలికలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని డీఈఓ అశోక్ అన్నారు. భారీ వర్షానికి జలమయమైన అర్వపల్లి కేజీబీవీని శుక్రవారం డీఈఓ అశోక్, జీసీడీఓ పూలన్ సందర్శించారు. కేజీబీవీలో ఉన్న బాలికలను తాత్కాలికంగా ఇళ్లకు పంపించారు. నీళ్లు తగ్గే వరకు బాలికలు ఇళ్లకు వెళ్లాలని సూచించారు. వారి వెంట ఎస్‌ఓ నాగరాణి, అధ్యాపకులు, సీఆర్‌టీలు, సిబ్బంది ఉన్నారు.

పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలి



మునగాలలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న డీపీఓ యాదగిరి

మునగాల: గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యమిచ్చి పరిసరాల పరిశుభ్రత పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) యాదగిరి అన్నారు. శుక్రవారం ఆయన మునగాలలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. అనంతరం పీహెచ్‌సీని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు సేవలందించాలన్నారు. అనంతరం స్థానికంగా ఉన్న నర్సరీని సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుంటల రమేష్‌దీనదయాళ్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి.రవీందర్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వరాలతల్లీ.. వందనం

శ్రావణ శుక్రవారం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పలు ఆలయాల్లో మహిళలు సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. లక్ష్మీదేవిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చన, మంగళహారతి తదితర పూజలు చేసి వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో సంతోషిమాత అమ్మవారు



సూర్యాపేట పట్టణంలోని శ్రీసంతోషిమాత ఆలయంలో వ్రతంలో పాల్గొన్న మహిళలు

స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : స్వాతంత్య్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎస్పీ కె.నరసింహతో కలిసి స్వాతంత్య్ర దినోత్సవం ఏర్పాట్లపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీస్ శాఖ పరేడ్‌కు సంబంధించి ఏర్పాట్లు చేయాలన్నారు. స్వాతంత్య్ర సమరయోధుల జాబితా తయారు చేయాలని సూచించారు.

డ్రగ్స్‌ను నిర్మూలించాలి

అనంతరం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఎన్ కార్డ్, నషా ముక్త్ భారత్ అభియాన్‌పై ఎస్పీ నరసింహతో కలిసి ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు.

యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా డ్రగ్స్ నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని కోరారు. ఈనెల 13న యాంటీ డ్రగ్స్‌పై పాఠశాలలు, కళాశాలలు యూనివర్సిటీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఉచితం

అనంతరం జరిగిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందజేస్తుందని తెలిపారు. వానాకాలం ప్రారంభమైనందున ఇసుక సరఫరాకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. ముందుగా ఇసుక బజారుల ఏర్పాటుకు స్థలాలను గుర్తించాలన్నారు. నాగారం మండలం పేరబోయినగూడెం అప్రోచ్ రోడ్డుకు ప్రతిపాదనలు పంపాలని పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్లను ఆదేశించారు. జిల్లాలో చేపడుతున్న జానపహాడ్, బెట్టి తండా, ముత్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్లకు, మున్నేరు వాగు రక్షణ గోడకు ఇరిగేషన్ శాఖకు ఇసుక అనుమతి ఇవ్వాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశాల్లో ఎస్పీ కె.నర్సింహ, అదనపు కలెక్టర్ పి.రాంబాబు, డీఎఫ్‌ఓ సతీష్ కుమార్, డీఆర్‌డీఓ వీవీ అప్పారావు, ఆర్డీఓ వేణుమాధవ్, డీపీఓ యాదగిరి, సంక్షేమ అధికారులు దయానంద రాణి, శంకర్ నాయక్, అబ్కారీ సూపరింటెండెంట్ లక్ష్మానాయక్, ట్రాన్స్ పోర్ట్ అధికారి జయప్రకాశ్‌రెడ్డి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సురేందర్, సూపరింటెండెంట్ శ్రీనివాసరాజు, సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ సీహెచ్ హన్మంతరెడ్డి, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, చిత్రంలో ఎస్పీ నరసింహ, అదనపు కలెక్టర్

సెల్ఫీ.. విత్ రాఖీ



అన్నాచెల్లెల్ల అనురాగానికి ప్రతీక రాఖీ పండుగ. శనివారం రాఖీ పండుగ జరుపుకునేందుకు మీరు సిద్ధమయ్యారా.. మీ ఫొటోలను 'సాక్షి'లో చూసుకోవాలనుకుంటున్నారా.. మరి ఎందుకు ఆలస్యం.. మీ సోదరీమణులతో రాఖీలు కట్టించుకుంటూ సెల్ఫీ తీసుకున్న ఫొటోలను 'సాక్షి'కి పంపిస్తే ఆదివారం సంచికలో ప్రచురిస్తాం.

'రాఖీ' సెల్ఫీ ఫొటోలు పంపాల్సిన వాట్సప్ నం.
99489 38922

వరద పాఠం నేర్వలే..!



గతేడాది సెప్టెంబర్‌లో కురిసిన వర్షానికి ముంపునకు గురైన ఆర్‌కే నగర్ గార్డెన్ ప్రాంతం (ఫైల్)

'పేట'కు ముంపు ముప్పు తప్పేదెలా..?

- భారీ వర్షాలకు మునుగుతున్న లోతట్టు ప్రాంతాలు
- గతేడాది ఇచ్చిన హామీలు నెరవేర్చని మున్సిపల్ యంత్రాంగం
- నామమాత్రపు పనులతోనే నరిపెడుతున్న వైనం
- వర్షాలు కురుస్తుండడంతో ఆందోళనలో ముంపు కాలనీల ప్రజలు

సూర్యాపేట అర్బన్ : భారీ వర్షం వస్తేచాలు సూర్యాపేట జిల్లా కేంద్రంలో పలు కాలనీలు ముంపు బారిన పడుతున్నాయి. దీంతో ఆయా కాలనీల ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని గడపాల్సిన పరిస్థితి. అయితే గతేడాది సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు సుందరయ్య నగర్ కాలనీతోపాటు ఆర్కే గార్డెన్ సమీపంలోని వివిధ కాలనీల్లోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. సద్దుల చెరువు అలుగు పోయడంతో సుందరయ్య నగర్ కాలనీలోకి నీరు వచ్చి ఇళ్లలోకి ప్రవేశిస్తుంది. సద్దుల చెరువు అలుగు నీరు పారే కాలువ చెత్తాచెదారం మట్టితో కూరుకుపోవడంతో వరదనీరు సరిగా పారక ఇళ్లలోకి వస్తుంది. కాలువపై ఉన్న బ్రిడ్జిల దగ్గర చిన్నచిన్న గూనలకు బదులు పెద్ద గూనలు వేస్తే వరదనీరు సాఫీగా ముందుకెళ్తుందని స్థానిక ప్రజలు అంటున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడం.. భారీ వర్షం పడితే వరద నీరు తమ ఇళ్లలోకి వస్తుందని, వెంటనే అధికారులు స్పందించి ముందస్తుగా వరద ముంపు ముప్పు తప్పేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీ వద్ద నాలా అస్తవ్యస్తం

ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీ, ఎస్పీ ఆఫీస్‌కు వెళ్లే రోడ్డు వద్ద గల నాలా ప్రమాదకరంగా తయారైంది. బ్రిడ్జి కింద చిన్న చిన్న గూనలు వేయడంతో వాటిలో వరదనీరు సాఫీగా పోవడంలేదు. భారీ స్థాయిలో వరద వచ్చినప్పుడు వరదనీరు పైకివచ్చి బ్రిడ్జి కోతకు గురవుతోంది. పైగా ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజీ చిన్నపాటి చెరువులా తయారవుతుంది.

60 ఫీట్ల రోడ్డు జలమయంగా..

గతేడాది సెప్టెంబర్‌లో భారీ వర్షం వచ్చినప్పుడు 60 ఫీట్ల రోడ్డు వద్ద నాలా పొంగడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లే రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్లలోకి నీరు ప్రవేశించి స్థానికులు ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం నాలాలో మట్టి తీసి శుభ్రం చేయడంతో సమస్య కొద్దివరకు పరిష్కారమైంది. నాలాలను పెద్దగా చేసి ఎప్పటికప్పుడు అడ్డంకులను తొలగిస్తే ఎలాంటి సమస్యలు ఉండవని స్థానికులు అంటున్నారు.



సూర్యాపేటలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల వద్ద శిథిలావస్థలో ఉన్న కల్వర్టు

గతంలో చిన్నగా ఉన్న కాలువని పెద్దగా చేయడంతో ప్రస్తుతం కాస్త ఉపశమనం కలిగిందని స్థానికులు అంటున్నారు. అలాగే ఎస్పీ ఆఫీస్ ముందు గల ఈదులవాగు మీద చిన్నచిన్న గూనలు వేసి నిర్మించడంతో ఇరుకుగా మారింది. దీంతో ఎస్వీ కాలేజ్ వెనుక ప్రాంతమైన ఆర్కే నగర్ జలమయంగా మారుతుంది. బ్రిడ్జి మీద నుంచి వెళ్లే మామిళ్లగడ్డ, సీతారాంపురం, ఇందిరమ్మ కాలనీ రైతులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ఈదులవాగు మీద పెద్ద బ్రిడ్జి నిర్మించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సైడ్ కాల్వలు నిర్మించాలి

గతేడాది భారీ వర్షాల నేపథ్యంలో మా కాలనీ పక్కనే ఉన్న కంపెనీ గోడ కూలడంతో అందులోని నీళ్లన్నీ మా ఇంటి మీదకి వచ్చి మా ఇల్లు కూలింది. రెండు మూడు రోజులు నిద్రలేని రాత్రులు గడిపాము. ప్రస్తుతం వర్షం వచ్చినా ఇళ్లలోకి నీళ్లు రాకుండా మట్టి పోసుకున్నాం. కాలనీలో సైడ్ కాల్వలు నిర్మించాలి.

– అంగోతు రాజమ్మ, సుందరయ్య నగర్, సూర్యాపేట

నాలాను పెద్దగా చేయాలి



నాలా, వరద కాలువ చిన్నగా ఉండడంతో భారీ వర్షం వచ్చినప్పుడు ఈదులవాగు దగ్గర చిన్న బ్రిడ్జిపై నుంచి వరద పారుతూ మా కాలనీలోకి చేరి ఇళ్లను ముంచెత్తుతుంది. దీంతో ఏటా చాలా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు చొరవ చూపి నాలాను వెడల్పు చేసి బ్రిడ్జిని పెద్దగా నిర్మించి సమస్యను పరిష్కరించాలి.

– కొమ్మిశెట్టి రాములు, ఆర్‌కే నగర్, సూర్యాపేట

ఈదులవాగు మీద పెద్ద బ్రిడ్జి కట్టాలి



ఈదులవాగు మీద చిన్న బ్రిడ్జి ఉండడంతో అందులోనుంచి నీటి ప్రవాహం సాఫీగా వెళ్లడం లేదు. దీంతో ఆర్‌కే నగర్, ఎస్వీ కాలేజీ వెనుక ప్రాంతం నీట మునుగుతోంది. వరద తాకిడికి బ్రిడ్జి కొట్టుకుపోయింది. ఈ బ్రిడ్జి మీదుగా వెళ్లేందుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. వాగుపై పెద్ద బ్రిడ్జి కట్టాలి.

– మన్నె కొమరెల్లి, మామిళ్లగడ్డ, సూర్యాపేట

కోదాడలో మళ్లీ వరద



కోదాడ పెద్దచెరువు అలుగునీటిలో మునిగిన షిర్డీసాయి నగర్ కాలనీ

- నీట మునిగిన షిర్డీసాయినగర్, భవానినగర్ కాలనీలు
- గతేడాది వరద ముంచెత్తినా ముందస్తు చర్యలు చేపట్టని అధికారులు
- పెద్ద చెరువు అలుగు పోస్తుండడంతో రాకపోకలకు ఆటంకం

కోదాడ: కోదాడ పట్టణంలో గురువారం రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు కురిసిన భారీ వర్షానికి పలు లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు భయంతో వణికిపోయారు. కోదాడ పెద్దచెరువుకు భారీగా వరద రావడంతో అలుగు పోస్తోంది. దీంతో కోదాడ –అనంతగిరి రోడ్డుపై వరద పారడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. గతేడాది సెప్టెంబర్ 1వ తేదీ రాత్రి కురిసిన వర్షానికి కోదాడ పెద్ద చెరువు అలుగునీటితో పూర్తిగా మునిగిపోయిన కోదాడ –ఖమ్మం రోడ్డులోని షిర్డీసాయినగర్ కాలనీ గురువారం రాత్రి కురిసిన వర్షానికి మరోసారి ముంపునకు గురైంది. ఇళ్ల చుట్టూ వరదనీరు చేరడంతో కాలనీ వాసులు బయటకు రావడానికి ఇబ్బందులు పడ్డారు. పెద్దచెరువు అలుగు వాగులో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని వారం రోజుల క్రితం కాలనీ వాసులు ఆందోళన చేసినా అధికారులు పట్టించుకోలేదు. దీంతో గురువారం రాత్రి కురిసిన వర్షానికి పెద్దచెరువు అలుగుపోసి వరద కాలనీ మీదకు మళ్లిందని, దీంతో మళ్లీ ముంపుబారిన పడ్డామని స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాగే భవానీనగర్ కూడా గతేడాది మాదిరిగానే గురువారం రాత్రి కురిసిన వర్షానికి ముంపునకు గురైంది. దీంతో స్థానికుల ఫిర్యాదు మేరకు గురువారం రాత్రి 11 గంటల సమయంలో జేసీబీ సాయంతో కాలనీ మధ్యలో ఉన్న నాలా ప్రవాహానికి అడ్డుగా ఉన్న డివైడర్లను పగులగొట్టి వరదనీటిని కిందివైపు మళ్లించారు. అయితే గతేడాది ఈ రెండు కాలనీలను పరిశీలించిన కలెక్టర్ ఆక్రమణలు తొలగించి నాలా వంతెనను వెడల్పు చేయాలని ఆదేశించినా సమస్య పరిష్కారం కాలేదు. అలాగే కోదాడ-అనంతగిరి రోడ్డులో పెట్రోల్‌బంక్ వద్ద ఉన్న ఎర్రకుంట అలుగు కాలువపై మజీద్ వద్ద పెద్ద గూనలతో కల్వర్టు నిర్మించి, కాల్వను వెడల్పు చేయాలని ఆదేశించినా ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదు.



కోదాడ- అనంతగిరి రోడ్డుపై పారుతున్న పెద్ద చెరువు అలుగు నీరు



అలుగు పోస్తున్న కోదాడ పెద్దచెరువు



కోదాడలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆడిటోరియంలోకి చేరిన వరద

ప్రాజెక్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ నరసింహ

సూర్యాపేట : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రాజెక్టులు, వంతెనల వద్ద పోలీసులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కె.నరసింహ అన్నారు. శుక్రవారం సూర్యాపేట మండల పరిధిలోని మూసీనది ప్రవాహాన్ని పరిశీలించారు. అలాగే భీమారం గ్రామం వద్ద వంతెనను పరిశీలించి మాట్లాడారు. ప్రాజెక్టులు, వంతెల వద్ద పర్యాటకులు ప్రమాదాల బారిన పడకుండా హెచ్చరిక సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రవాహం ఉధృతంగా ఉన్నప్పుడు మూసీనదిలోకి ఎవరూ వెళ్లొద్దన్నారు. యువత సెల్ఫీలు అంటూ విషాదం కొనితెచ్చుకోవద్దని సూచించారు. సూర్యాపేట, పెనపహాడ్, నేరేడుచర్ల, పాలకవీడు పరిధిలోని మూసీ పరీవాహక ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తడం వల్ల కృష్ణానదిలో నీటి ఉధృతి అధికంగా ఉందన్నారు. అత్యవసర సమయాల్లో పోలీస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, డయల్ 100, జిల్లా స్పెషల్ బ్రాంచ్ 87126 86026 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. ఎస్పీ వెంట సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్, స్థానిక అధికారులు ఉన్నారు.



మూసీ ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహ

సైబర్ మోసగాళ్లతో జాగ్రత్త

సూర్యాపేటటౌన్ : బ్యాంకులకు వరుసగా పండగ సెలవులు ఉన్నందున సైబర్ మోసగాళ్లతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ నరసింహ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పండగ బహుమతులు అంటూ, స్పెషల్ ఆఫర్స్ అంటూ ఏమైనా బ్లూ లింక్స్, మెసేజ్‌లు వచ్చినా వాటిని అనుసరించవద్దని, అపరిచితులు డబ్బులు అడిగితే స్పందించవద్దని పేర్కొన్నారు. ఎవరైనా సైబర్ మోసగాళ్ల వల్ల ఆర్థిక నష్టానికి గురైతే వెంటనే 1,930 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.



రాఖీ సందడి: సూర్యాపేట పట్టణంలోని ఎంజీ రోడ్డులో శుక్రవారం రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు



సూర్యాపేటలోని ఓ బేకరీలో మిఠాయిలు కొంటున్న జనం

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహ స్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లి రావు, ఈఓ నవీన్, అర్చకులు తుమాటి లక్ష్మణాచార్యులు, నర్సింహమూర్తి, ఆంజనేయచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

అంతటా మోస్తరు వర్షం



చిలుకూరు సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న అంతర్గంగ వాగు

భానుపురి (సూర్యాపేట) : జిల్లావ్యాప్తంగా గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు మోస్తరు వర్షం కురిసింది. దాదాపు అన్ని మండలాల్లోనూ వర్షపాతం నమోదైంది. ఐదారు రోజులుగా తీవ్ర ఉక్కపోత, ఎండ తీవ్రత ఉంది. ఈ క్రమంలోనే గురువారం రాత్రి ఒక్కసారిగా మబ్బులు పట్టి వర్షం కురిసింది. చాలాచోట్ల రాత్రంతా వర్షం పడుతూనే ఉంది. దీంతో లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరగా.. పలు మండలాల్లో చెరువులు, కుంటల్లోకి వాగులు సాగాయి. జిల్లాలో అత్యధికంగా నడిగూడెం మండలంలో 101.0 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా మేళ్లచెరువు మండలంలో 16.7 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో సరాసరి 53.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

వర్షపాతం వివరాలు

మండలం	వర్షపాతం
నాగారం	65.2
తిరుమలగిరి	36.1
తుంగతుర్తి	36.4
మద్దిరాల	45.0
నూతనకల్	59.9
జాజిరెడ్డిగూడెం	83.9
సూర్యాపేట	40.3
ఆత్మకూర్(ఎస్)	62.5
మోతె	58.6
చివ్వెంల	69.1
పెన్‌పహాడ్	31.5
మునగాల	58.7
నడిగూడెం	01.0
అనంతగిరి	56.4
కోదాడ	88.5
చిలుకూరు	72.0
గరిడేపల్లి	48.0
నేరేడుచర్ల	34.6
పాలకవీడు	32.8
మఠంపల్లి	40.7
హుజూర్‌నగర్	42.4
మేళ్లచెరువు	16.7
చింతలపాలెం	42.7

రాఖీ పండుగకు వస్తూ..

- రోడ్డుప్రమాదంలో యువకుడు మృతి
- మరొకరికి తీవ్రగాయాలు

రామగిరి(నల్లగొండ): రాఖీ పండుగకు సొంతింటికి వస్తూ రోడ్డు ప్రమాదంలో యువకుడు ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. నల్లగొండ పట్టణంలోని సాగర్‌రోడ్డు ముత్యాలమ్మ కాలనీకి చెందిన సోదరులు గంటకంపు నాగరాజు, మణికంఠ హైదరాబాద్‌లో కారు డ్రైవింగ్ చేస్తారు. నల్లగొండలో ఉంటున్న సోదరిచే రాఖీ కట్టించుకునేందుకు శుక్రవారం హైదరాబాద్ నుంచి నల్లగొండ బైక్‌పై బయలుదేరారు. నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డు గిరకబాయిగూడెం శివారులో ఎదురుగా డీసీఎం వాహనం అజాగ్రత్తగా అతి వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న నాగరాజు(26) ప్రమాద స్థలంలోని మృతిచెందాడు. సోదరుడు మణికంఠకు కుడికాలు, చేయికి గాయాలు అయ్యాయి. తల్లి గంటకంపు అరుణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు నల్లగొండ రూరల్ ఎస్సై సైదాబాబు చెప్పారు.

కూలిన రైస్ మిల్లు గోడ

- ధ్వంసమైన ట్రాక్టర్



గోడ కూలడంతో ధ్వంసమైన ట్రాక్టర్

బొమ్మలరామారం : ట్రాక్టర్‌కు ఆఫ్ వీల్స్ బిగిస్తుండగా పక్కనే ఉన్న రైస్ మిల్లు గోడ కూలింది. దీంతో ఇద్దరు యువకులు అక్కడి నుంచి పక్కకు జరగగా.. ట్రాక్టర్ నుజ్జునుజ్జు అయింది. బొమ్మలరామారం మండలంలోని నాగినేనిపల్లి గ్రామానికి చెందిన ఎడిజర్ల బాలకృష్ణ ట్రాక్టర్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి గంగరబోయిన కృష్ణ పొలాన్ని శుక్రవారం దున్నడానికి వెళ్లాడు. గంగరబోయిన కృష్ణ పొలం పక్కనే రైస్‌మిల్ ఉంది. ట్రాక్టర్ దుక్కి దున్న దానికి ట్రాక్టర్ డ్రైవర్ బాలకృష్ణ, కృష్ణ కొడుకు ఉపేందర్‌లు ఆఫ్ వీల్స్ బిగిస్తుండగా.. చేస్తుండగా రైస్ మిల్లు గోడ కూలింది. క్షణాల్లో తేరుకున్న ఇద్దరు యువకులు అక్కడి నుంచి పక్కకు జరగడంతో ప్రాణాపాయం తప్పింది. గోడ కూలడంతో ట్రాక్టర్ ధ్వంసమైంది. నెల రోజుల క్రితమే తెచ్చుకున్న కొత్త ట్రాక్టర్ గోడ కూలి ధ్వంసం కావడంతో బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

హుజూర్‌నగర్ : మండలంలోని లింగగిరిలో గురువారం రాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన తురక నాగలక్ష్మి ఇంట్లో రాత్రి సమయంలో విద్యుత్ హెచ్చుతగ్గుల వల్ల షార్ట్‌సర్క్యూట్ జరిగింది. దీంతో ఇంట్లో మంటలు వ్యాపించి టీవీ, పుస్తకాలు, బీరువాలో బట్టలు, నగదు కాలిపోయాయి. దాదాపు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. శుక్రవారం ఆర్ఐ గాలి శ్రీనివాస్ ఇంటిని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

వరలక్ష్మీ నమోస్తుతే..

శ్రావణ శుక్రవారం సందర్భంగా సాక్షి నిర్వహించిన 'వరలక్ష్మి సెల్ఫీలకు ఆహ్వానం'కు విశేష స్పందన లభించింది. వరలక్ష్మి పూజలో కూర్చున్న మహిళలు సెల్ఫీ తీసుకుని పంపించారు. అందులో కొన్ని..



అమృత, పానుగోడు, గరిడేపల్లి



అలుగునూరి నలిని, సూర్యాపేట



బాసంపల్లి అనూష, పానుగోడు



భాగ్యలక్ష్మి, సూర్యాపేట



ధరావత్ పద్మ, దుప్పతండా పెన్‌పహాడ్



దేగల రాధిక, ఆత్మకూర్(ఎస్)



డి.అన్నపూర్ణ, కందగట్ల, ఆత్మకూర్



డి. సునీత, నెమ్మికల్ ఆత్మకూర్(ఎస్)



దిర్నసపు స్వాతి, సూర్యాపేట



ఎలుగూరి నలినిగౌడ్, సూర్యాపేట



గెండాల భాగ్యలక్ష్మీ, సూర్యాపేట



గుర్రం ఉమాదేవి, హుజూర్‌నగర్



జీలకర్ర పుష్పలత, నూతనకల్



కల్యాణి, సూర్యాపేట



కటకం ఉమిత్ర, గరిడేపల్లి



కటికం నవ్య, సూర్యాపేట



కట్ల స్వప్న, వడ్లకొండ సదాలక్ష్మి, కుడకుడ, సూర్యాపేట



కొత ఉమారాణి, మోతె



కొట్టు అరుణ, హుజూర్‌నగర్



లావణ్య, హుజూర్‌నగర్



నాగమణి, హుజూర్‌నగర్



నాగమణి, కోదాడ



నల్లపాటి భార్గవి, మునగాల



నవ్య, వినాయకనగర్, సూర్యాపేట



పరుశబోయిన శ్రావణి, గరిడేపల్లి



రాజేశ్వరి, గుమ్మడవెల్లి, మద్దిరాల



రాణిశెట్టి సునీత, హుజూర్‌నగర్



సక్కుబాయి, కోదాడ



సామ శ్రీదేవి, సూర్యాపేట



సొల్లేటి పద్మ, బాలెంల



సుందరి జ్యోతి, పానుగోడు, గరిడేపల్లి



నూకల వర్షిణి, సూర్యాపేట

వన మహోత్సవం ఉద్యమంలా నిర్వహిద్దాం

- ఎంజీ యూనివర్సిటీ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

నల్లగొండ టూటౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్టూడెంట్ పర్యావరణ్ కాంపిటీషన్ (ఎస్ఎస్‌పీసీ) 2025 హరిత్ ద వే ఆఫ్ లైఫ్ పోస్టర్‌ను శుక్రవారం ఎంజీ యూనివర్సిటీలో వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ, కేంద్ర విద్యా శాఖ, తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో జరగనున్న జాతీయ పర్యావరణ విద్యా విధానంలో భాగంగా సామాజిక ఉద్యమం మాదిరిగా వన మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నెల రోజుల పాటు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది విద్యార్థుల చేత మొక్కలు నాటించనున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడేందుకు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ ఆకుల రవి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ జి. ఉపేందర్ రెడ్డి, అధ్యాపకులు హైమావతి, డాక్టర్ శ్రీనివాస్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

కాన్ఫరెన్స్ కరపత్రాల ఆవిష్కరణ

నల్లగొండ టూటౌన్: గణితశాస్త్రం దాని అనువర్తనాలపై వచ్చే నెల 3, 4 తేదీల్లో నిర్వహించనున్న జాతీయ కాన్ఫరెన్స్ కరపత్రాలను శుక్రవారం మహాత్మాగాంధీ యూనివర్సిటీలో వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ సెమినార్లు, సదస్సులు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు పరిశోధనలపై అవగాహన పెరుగుతుందన్నారు. రిజిస్ట్రార్ అల్వాల రవి మాట్లాడుతూ జాతీయ సెమినార్‌కు కావాల్సిన ఏర్పాట్లలో యూనివర్సిటీ తరఫున అన్ని విధాల సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంజీయూ గణిత విభాగ అధిపతి, మద్దిలేటి పసుపుల, బోర్డాఫ్ స్టడీస్ చైర్ పర్సన్ డాక్టర్ జి. ఉపేందర్ రెడ్డి, అధ్యాపకురాలు హైమావతి, శ్రీనివాస్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ కేసులో ఆర్ఎంపీ అరెస్టు

- ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్, సెల్‌ఫోన్ స్వాధీనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

సూర్యాపేటటౌన్ : వైద్యం వికటించి గర్భిణి మృతి చెందిన కేసులో ఆమెకు లింగ నిర్ధారణ పరీక్ష చేసిన ఆర్ఎంపీని పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ ప్రసన్నకుమార్ వెల్లడించారు. మే 24న మోతె మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన బయ్య అనూష అనే గర్భిణి నకిరేకల్‌లోని ఆర్ఎంపీ వైద్యుడు బాత్క యాదగిరి వద్ద లింగనిర్ధారణ పరీక్ష చేయించుకుంది. ఆడపిల్ల అని తేలడంతో ఆమె భర్త నగేష్ మరో ఆర్ఎంపీ జానయ్య, వారి బంధువు సందీప్ కలిసి ఆమెను సూర్యాపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఆమెకు అర్హత లేని వైద్యులతో అబార్షన్ చేయించారు. అధిక రక్తస్రావం కావడంతో ఆమెను ఖమ్మంలోని మరో ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలిస్తుండగా మృతి చెందింది. ఈవిషయమై డీఎంహెచ్ఓ ఫిర్యాదు మేరకు పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నమ్మదగిన సమాచారం మేరకు ఆర్ఎంపీ బాత్క యాదగిరిని నకిరేకల్‌లోని తన నివాసంలో పట్టణ పోలీసులు అరెస్టు చేసి విచారించగా నేరం అంగీకరించినట్లు డీఎస్పీ తెలిపారు. మొత్తం 10 మందిపై కేసు కాగా కొంత మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా మరికొంత మంది పరారీలో ఉన్నట్లు చెప్పారు. నిందితుడు యాదగిరి వద్ద ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి నిందితుల అరెస్టు

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రాజశేఖరరాజు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు

మిర్యాలగూడ అర్బన్: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఏడుగురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను శుక్రవారం మిర్యాలగూడ టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాజశేఖరరాజు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పల్నాడు జిల్లా, వెల్దుర్తి మండలం, ఉప్పలపహాడ్ గ్రామానికి చెందిన భూక్యా హనుమా నాయక్, సంగాల కాటంరాజు, నర్సారావుపేట జిల్లా కారంపుడికి చెందిన మద్దూరి చంటి గంజాయికి అలవాటు పడి ముఠాగా ఏర్పడ్డారు. బలిమెల, ఒడిశా రాష్ట్రానికి చెందిన ఆనంద్‌గురు వద్ద గంజాయి కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. వీరికి మిర్యాలగూడకు చెందిన కొందరు వ్యక్తులు పరిచయం కావడంతో వారి ద్వారా ఇక్కడకు తీసుకువచ్చి అమ్ముతున్నారు. ఈక్రమంలో గురువారం భూక్యా హనుమానాయక్, సంగాల కాటంరాజు, మద్దూరి చంటి రెండు గ్రూపులుగా విడిపోయి చంటి బైక్‌పై మిర్యాలగూడ పట్టణానికి వచ్చి ఐదున్నర కిలోల గంజాయిని విక్రయిస్తున్నారనే సమాచారం అందింది. మద్దూరి చంటి, మిర్యాలగూడకు చెందిన షేక్ రియాజ్, మహమ్మద్ హర్షత్ అయూబ్, మహ్మద్ సలీం అక్బర్, మహమ్మద్ జునైద్ అలీ, షేక్ అఫ్రోజ్, కుర్ర సందీప్ ఖానాపురం శరత్‌లను అరెస్టు చేశామని.. భూక్యా హనుమానాయక్, సంగాల కాటంరాజు, ఆనంద్‌గురు పరారీలో ఉన్నారని తెలిపారు. నిందితుల వద్ద 7.4 కిలోల గంజాయి, కారు, మూడు ద్విచక్ర వాహనాలు, పది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సమావేశంలో టూ టౌన్ సీఐ సోమనర్సయ్య, రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య, టూటౌన్ ఎస్ఐ రాంబాబు, హెడ్ కానిస్టేబుల్ ఎస్.యాదగిరిరెడ్డి, కానిస్టేబుళ్లు ఎల్.సూర్య, పి.బాలకృష్ణ, ఎండీ అక్బర్ పాష, జి.లక్ష్మయ్య, రాజశేఖర్, సమాద్, వెంకన్న, మహేష్, సైదులు, నాగరాజు, రాములునాయక్, సైదానాయక్ తదితరులున్నారు.

రేషన్ బియ్యం నిందితుల రిమాండ్

మిర్యాలగూడ అర్బన్: రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తుండగా పట్టుబడిన ఐదుగురు నిందితులను శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. మిర్యాలగూడ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాజశేఖరరాజు వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, గుంటూరు జిల్లా, అర్బన్ బాలాజీ నగర్‌కు చెందిన కొమ్మలపాటి శ్రీనివాస్, గుంటూరుకు చెందిన వెంక సుబ్బారావు, పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన మహేష్‌రెడ్డి, నరసారావుపేటకు చెందిన రమేష్, సుకిల శ్రీనివాస్, యాటకూరుకు చెందిన నాగసాయి, గుజరాత్‌కు చెందిన మన్సూక్ బాయి, మనుబాయి మక్వన మొత్తం ఎనిమిది మంది ముఠాగా ఏర్పడ్డారు. రేషన్‌కార్డు లబ్ధిదారుల వద్ద తక్కువ ధరకు రేషన్ బియ్యం కొని రాష్ట్రం దాటించి అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వారి వ్యాపారం సాఫీగా జరగడానికి వారు పిడుగురాళ్లకు చెందిన మహేష్‌రెడ్డికి నెలకు రూ.3లక్షలు ఇస్తే.. అతడు లోడింగ్, అన్‌లోడింగ్, చెక్‌పోస్టులు దాటించేవాడు. ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు రమేష్, వాసు, శ్రీనివాసు అనే వ్యక్తులు కొంత కమీషన్ తీసుకుని సహకరించేవారు. ఈ క్రమంలో ఈ నెల 5న లారీలో 300 క్వింటాళ్ల రేషన బియ్యం లోడు చేసుకుని వస్తున్న క్రమంలో వాడపల్లి ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో పట్టుబడ్డారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేశామని, మరో ముగ్గురు పరారీలో ఉన్నారని డీఎస్పీ తెలిపారు.



లాభాల పూ'బంతి'

- తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం
- మిరప, పత్తి పంటల్లో రక్షణ పంటగా బంతి పూల సాగు



పెద్దవూరలో సాగవుతున్న బంతి పూల తోట

పాడిపంట

పెద్దవూర: బంతి సాగును జూన్, జూలై, అక్టోబర్, నవంబర్ నెలల్లో సాగు చేసేవారు. కానీ గత కొన్నేళ్లుగా రైతులు ఏడాది పొడవునా సాగు చేస్తున్నారు. జూన్, జూలై నెలల్లో సాగు చేసిన బంతి సాగు సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లోనూ, అక్టోబర్, నవంబర్ నెలలో సాగు చేసిన బంతిపూలు డిసెంబర్, జనవరితో పాటు ఫిబ్రవరిలో వచ్చే పండుగలు, పెళ్లిళ్లు, జాతరలు, ఫంక్షన్లకు దిగుబడి వస్తుండటంతో మంచి గిరాకీ వస్తుంది. రైతులు నీటి వసతిని బట్టి బంతిని సాగు చేసుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చని హార్టికల్చర్ అధికారి మురళి తెలిపారు.

యాజమాన్యం రెండు రకాలు..

ఆఫ్రికన్ మేరీగోల్డ్ : ఈ జాతి ఎత్తుగా పెరిగి అతి పెద్ద సైజు పూలు పూస్తాయి. ఇందులో ఆఫ్రికన్ జెయింట్, ఆరెంజ్ డబుల్, ఆఫ్రికన్ ఎల్లోజెయింట్ డబుల్, క్రాక్ జాక్, గోల్డెన్ ఏజ్ రకాలు అనువైనవి.

ఫ్రెంచ్ మేరీగోల్డ్ : ఈ జాతి పూలకుండీల్లో పెంచుకునే రకాలు. దీనిలో రెడ్ బ్రోకేడ్, రెస్పిన్ రెడ్, బట్టర్ స్కాచ్, వాలెన్సియా రకాలు అనువైనవి.

నేలలు: నీరు త్వరగా ఇంకిపోయే తేలిక పాటి సారవంతమైన నేలలు, ఇసుక నేలలు, నీటి తేమ తక్కువగా ఉండే నేలలు బంతి సాగుకు అనుకూలం. బంతిని మిరప, పత్తి పంటల్లో రక్షక పంటగా కూడా సాళ్లలో సాగు చేసుకోవచ్చు.

వాతావరణం: మన వాతావరణ పరిస్థితులు బంతిసాగుకు అనుకూలం. జూలై మధ్య కాలం నుంచి ఫిబ్రవరి మొదటి వారం వరకు నాటితే మార్కెట్‌కు పూల సరఫరా సెప్టెంబర్ నుంచి ఏప్రిల్ వరకు చేయొచ్చు.

నారుమళ్లు: ఎకరానికి సరిపడ నారు పెంచడానికి 800-1000 గ్రాముల విత్తనం అవసరం. మళ్లు తయారు చేసుకునే సమయంలో ఒక చదరపు మీటరుకి 8-10 కిలోలు బాగా చిలికిన పశువుల ఎరువు వేయాలి. విత్తడానికి మొదలు ఫాలిడాల్ పొడి చల్లితే చీమలు, చెదలు వంటి ఇతర క్రిముల నుంచి రక్షణ పొందవచ్చు. ఎత్తు నారుమళ్లు చేసుకుని విత్తనాన్ని సాళ్లలో నాటుకుంటే మొక్కల మధ్య దూరం సమంగా ఉండి నారు మొక్కలు ఏపుగా పెరుగుతాయి. దీనివలన కలుపు మొక్కలు, చీడపీడల నివారణ కూడా వీలవుతుంది. విత్తిన 5-7 రోజుల్లో మొలకలు వస్తాయి.

నాటే విధానం: 15-20 రోజుల వయసు లేదా 3-4 ఆకులు వచ్చిన మొక్కలను 45×25 సెంటీమీటర్ల దూరంలో నాటితే మొక్కల సాంద్రత ఎక్కువగా ఉండి పూల దిగుబడి పెరుగుతుంది. నారుని సాయంకాలం నాటుకుంటే బాగా పాతుకుంటాయి. ఆఫ్రికన్ మొక్కల్ని 40×30 సెంటీమీటర్ల దూరంలోనూ, ఫ్రెంచ్ బంతి మొక్కల్ని 20×20 సెంటీమీటర్ల దూరంలో నాటితే పూల దిగుబడి బాగా ఉంటుంది. నాటిన తర్వాత పల్చగా నీరు పెట్టుకోవాలి.

ఎరువులు: ఆఖరి దుక్కిలో ఎకరానికి 20 టన్నుల చొప్పున బాగా చిలికిన పశువుల ఎరువు వేసి కలియదున్నాలి. దీనితోపాటు 20-40 కిలోల నత్రజని, 80 కిలోల భాస్వరం, 35 కిలోల పోటాష్‌ను ఇచ్చే ఎరువులను వేయాలి. మొక్కలు నాటిన 60 రోజుల వరకు శాఖీయంగా పెరిగే దశలో ఉంటాయి. ఈ సమయంలో తగినంత తేమ ఉండేలా చూడాలి. నేల స్వభావాన్ని బట్టి 5-8 రోజుల వ్యవధిలో నీరు కట్టాలి.

కత్తిరింపులు: వాణిజ్యపరంగా పెంచే ఆఫ్రికన్ బంతి రకాలు ఎత్తుగా పెరిగి చాలా తక్కువగా పూలు వస్తాయి. కనుక మొక్కలు 30-40 సెంటీమీటర్ల ఎత్తులో లేదా నాటిన 30-35 రోజులకు తల భాగం కత్తిరిస్తే మొక్క కింది భాగం నుంచి పక్క కొమ్మలు ఎక్కువగా వచ్చి పూల దిగుబడి పెరుగుతుంది.

సస్యరక్షణ:

నారుకుళ్లు తెగులు: నేలలో తడి ఎక్కువగా ఉండి వెచ్చని వాతావరణంలో ఈ తెగులు వ్యాప్తి చెందుతుంది. మొలకెత్తిన నారు మొక్కల కాండం కుళ్లి చనిపోతాయి. దీని నివారణకు లీటరు నీటికి 2 గ్రాముల కాప్టాన్ లేదా 1.5 గ్రాముల కార్బండిజమ్ కలిపిన మందు ద్రావణంతో నారు మడిని తడిపి నివారించవచ్చును.

మొగ్గ తొలిచే పురుగు: లార్వాలు పూమొగ్గలను తొలుస్తాయి. పూ మొగ్గలు విచ్చుకోవు. పూల దిగుబడి బాగా తగ్గుతుంది. దీని నివారణకు లీటరు నీటికి 2 మిల్లీలీటర్లు కార్బరిల్ కలిపి పిచికారీ చేసుకోవాలి.

పేను: పెద్ద, పిల్ల పురుగులు మొగ్గల్ని ఆశించి నష్టపరుస్తాయి. వీటి నివారణకు లీటరు నీటికి 2 మిల్లీలీటర్లు మలాథియాన్ లేదా 2 మిల్లీలీటర్లు డైమిథోయేట్ కలిపి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.

తామర పురుగులు: పిల్ల, తల్లి పురుగులు ఆకులు, పూల నుంచి రసాన్ని పీలుస్తాయి. ఆకుల మీద తెల్లని మచ్చలు కనిపిస్తాయి. ఇవి ఆశించిన మొగ్గలు గోధుమరంగుకు మారి ఎండిపోతాయి. నివారణకు లీటరు నీటికి 2 మిల్లీలీటర్లు డైమిథోయేట్ ను కలిపి పిచికారీ చేయాలి.

చేపల వేటకు వెళ్లిన యువకుడు గల్లంతు

వేములపల్లి: మూసీ వాగులో చేపల వేటకు వెళ్లిన యువకుడు గల్లంతయ్యాడు. ఆమనగల్లుకు చెందిన మద్దెబోయిన వెంకన్నపార్వతమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంతకాలంగా హైదరాబాద్‌లో ప్రైవేట్ వర్క్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురువారం గ్రామంలో బోనాలు నిర్వహిస్తుండగా రామకృష్ణ(22) హైదరాబాద్ నుంచి గ్రామానికి వచ్చాడు. శుక్రవారం సాయంత్రం తన స్నేహితులతో కలిసి మూసీ వాగు వద్ద చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి వాగులో పడిపోయాడు. గమనించిన స్నేహితులు కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ నీటి ప్రవాహానికి గల్లంతయ్యాడు. వాగు వెంట గాలింపు చర్యలు చేపట్టారు.

కాల్వలో పడి వ్యక్తి గల్లంతు

మాడుగులపల్లి: మండలంలోని పెద్దదేవులపల్లి కాల్వలో గురువారం సాయంత్రం వ్యక్తి గల్లంతయ్యాడు. ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం చెన్నైకి చెందిన ప్రభాకరన్ పెద్దదేవులపల్లి రెడ్డీస్ ల్యాబ్‌లో సేఫ్టీ విభాగంలో ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం సెలవు కావడంతో తన ముగ్గురు స్నేహితులతో కలిసి పెద్దదేవులపల్లి కాల్వ వద్దకు వెళ్లాడు. ప్రభాకరన్ ఈత కొట్టి బయటకు వచ్చేందుకు ప్రయత్నించగా కాలు జారి ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయాడు. స్నేహితులు గమనించి అతడిని రక్షించే ప్రయత్నం చేసినా ప్రవాహానికి కొట్టుకుపోయాడు. ప్రభాకరన్ స్నేహితుడు విఘ్నేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

లారీని ఢీకొట్టిన కారు..

- నలుగురికి స్వల్పగాయాలు



ధ్వంసమైన కారు

మునగాల: మండల కేంద్రం శివారులో స్థానిక భారత్ పెట్రోల్ బంక్ ఎదురుగా శుక్రవారం విజయవాడ నుంచి హైద్రాబాద్ వెళ్లే కారు అతివేగంతో ముందు వెళుతున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. కారులో ప్రయాణిస్తున్న ఓ కుటుంబానికి చెందిన నలుగురు ప్రయాణీకులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.ప్రమాదం సమయంలో కారులో ఉన్న బెలూన్లు తెరచుకోవడంతో నలుగురు వ్యక్తులు ప్రాణాలతో బయటపడ్డారు.

కూలి పనికి వెళ్తుండగా గుండెపోటుతో మహిళ మృతి

నకిరేకల్: కూలి పనికి వెళ్లేందుకు అడ్డామీదకు వచ్చిన మహిళకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుప్పకూలి అక్కడే ప్రాణాలు విడిచింది. ఈ సంఘటన శుక్రవారం నకిరేకల్‌లో చోటుచేసుకుంది. కేతేపల్లి మండలం కొత్తపేటకు చెందిన చందుపట్ల తిరుపతమ్మ(45) రోజు వారీ కూలీ పనికోసం శుక్రవారం ఉదయం నకిరేకల్‌లోని ఇందిరాగాంధీ చౌరస్తా సెంటర్‌కు వచ్చింది. ఆమెకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతిచెందింది.